teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 208 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 28 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ‘ 5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## తెలంగాణ శాసనసభలో "జపాన్ బృందం సందర్శన"

### రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై కీలక చర్చలు




## ఆధార్ యూజర్లకు గుడ్ న్యూస్

### ఇక ఎక్కడి నుంచైనా మొబైల్ నంబర్ అప్‌డేట్

జనవరి 28న సరికొత్త సేవలు ప్రారంభం

ఉడాయ్ డే సందర్భంగా యూఐడీఏ కానుక



న్యూ ఢిల్లీ, జనవరి 27 (తీన్మార్ న్యూస్): ఆధార్ – మొబైల్ నంబర్ అప్డేట్ పై యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. త్వరలోనే ఏ ప్రదేశం నుంచైనా ఆధార్ – మొబైల్ నంబర్ ను అప్డేట్ చేసుకునేలా కొత్త వ్యవస్థను తీసుకురానున్నట్లు తెలిపింది. ఆధార్ సర్వీసులను మరింత ఈజీగా ఉపయోగించుకునేందుకే దీనిని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది. ఈ కొత్త సేవను 2026 జనవరి 28న అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఉడై ప్రకటించింది. ఉడై డే వేడుకల సందర్భంగా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని ద్వారా కోట్లాది ఆధార్ వినియోగదారులకు

మిగతా 2 లో




## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల శంఖారావం



### ఫిబ్రవరి 11న మినీ సంగ్రామం

ఒకే విడతలో 173 పురపాలికలకు ఎన్నికలు

నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలు

ఫిబ్రవరి 13న ఫలితాల జోరు

2

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు.



## మేడారం జాతర వైద్య సేవలకు హై అలర్ట్



02

- 72 మెడికల్ క్యాంపులు, 3,199 మంది సిబ్బంది నియామకం
- గద్దెల వద్ద 50 పడకల ఆసుపత్రి
- 24గం పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు అంబులెన్స్ సేవలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహా

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి



### అభివృద్ధి బాధ్యత మాది

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అంతా ఉమ్మడి కుటుంబంలో భావించి ప్రజా ప్రభుత్వం

మిగతా 2 లో



## నార్త్ బ్లాక్‌లో ఘనంగా జరిగిన హల్వా వేడుక

సంప్రదాయ వేడుకలో పాల్గొన్న నిర్మలా సీతారామన్

ప్రారంభమైన లాక్-ఇన్ పీరియడ్

ఐదు రోజుల పాటు నిఘా నీడలో బడ్జెట్ బృందం

02

## సమ్మక్క- సారలమ్మ జాతరకు సర్వం సిద్ధం

భక్తులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

అమ్మవార్ల కృపతో అందరికీ మేలు కలగాలి



## సిట్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ నేత సంతోష్ రావు

జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ

నందినగర్ నివాసం నుంచి నేతలతో కలిసి రాక



హైదరాబాద్, జనవరి 28(తీన్మార్ న్యూస్) బీఆర్ఎస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ రావు సిట్ విచారణకు హాజరయ్యారు. మంగళవారం మధ్యాహ్నం నందినగర్ నివాసం నుంచి పలువురు నేతలతో కలిసి

మిగతా 2 లో



05

## సింగరేణిలో భారీ బొగ్గు కుంభకోణం

గవర్నర్‌కు కేటీఆర్ బృందం ఫిర్యాదు

సమగ్ర విచారణకు బీఆర్ఎస్ డిమాండ్

## పదేళ్లలో సమస్యలు తీరలేదు



05

విద్యాశాఖ నాకిస్తే కార్పొరేట్ స్కూళ్లు బంద్ చేస్తా

మంత్రి కోమటిరెడ్డి



## శాంతిభద్రతలు క్షీణించాయి


2

ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలివ్వాలి

కల్వకుంట్ల కవిత

# తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల శంఖారావం

హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మరో ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 166 మున్సిపాలిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మంగళవారం ఎస్ఈసీ రాణి కుముదిని మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించి ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే దఫాలో ఒకే రోజున ఈ ఎన్నికలు నిర్వహించబోతున్నామని, రీ పోలింగ్ ఎక్కడైనా అవసరం ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహించి మిగతా అన్ని స్థానాలతోపాటే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్ పర్సన్ల ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.




### నోటిఫికేషన్ షెడ్యూల్:

నోటిఫికేషన్ విడుదల: 28-01-2026
నామినేషన్ల స్వీకరణ: 28.-01-2026
నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ:30-01-2026
నామినేషన్ల పరిశీలన:31-01-2026
నామినేషన్లపై అభ్యంతరాలు:01-02-2026
అభ్యంతరాలపై పరిష్కారం:02-02-2026
నామినేషన్ల ఉపసంహరణ గడువు:03.02-2026
బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల:03-02-2026
పోలింగ్:11-02-2026
రీపోలింగ్-12-02-2026
కౌంటింగ్:13-02-2026 (ఉదయం 8 గంటల నుండి)

# నార్త్ బ్లాక్‌లో ఘనంగా జరిగిన హల్వా వేడుక



న్యూ ఢిల్లీ, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మరో మూడు రోజుల్లో కేంద్ర బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం నాడు సాంప్రదాయ 'హల్వా' వేడుకలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2026-27 కేంద్ర బడ్జెట్ తయారీకి ఇది చివరి దశను సూచిస్తుంది. కర్తవ్య భవన్-ఈలోని కొత్త ప్రాంగణంలో ప్రింటింగ్ ప్రెస్ లేకపోవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ పాత కార్యాలయం రాయ్‌సినా హిల్‌లోని నార్త్ బ్లాక్‌లో ఈ వేడుక జరిగింది. ఆర్థిక మంత్రి, ఆమె బృందంలోని చాలా మందిని గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మక నార్త్ బ్లాక్ నుంచి కర్తవ్య భవన్‌లో ఉన్న కొత్త కేంద్ర సచివాలయ కార్యాలయానికి మారిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయమంత్రి పంకజ్ చౌదరీ, ఆర్థిక శాఖలోని పలు విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ రూపొందించడంలో భాగస్వామ్యం ఉన్న అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత బడ్జెట్ ప్రెస్‌ను పరిశీలించిన ఆర్థిక మంత్రి, ప్రింటింగ్ ఎర్పాట్లను పరిశీలించారు.

### లాక్-ఇన్‌పీరియడ్ అధికారులు

హల్వా వేడుక అంటే బడ్జెట్ లాక్-ఇన్‌పీరియడ్. ఈ ప్రక్రియ బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. బడ్జెట్ ప్రకటన ముగిసేంతవరకు ఎవ్వరూ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. అందరూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత వారందరూ బయటకు వస్తారు. ఐదురోజులపాటు వారు నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అయిన ఘటన కారణంగా ఈ లాక్-ఇన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించండి

మొదటి పేజీ తరువాయి



చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన మధిర ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పట్టణ ప్రాంతాల్లో రకరకాల ప్రణాళికలతో నివసిస్తున్న పేద, మధ్యతరగతి వర్గాల అభివృద్ధికి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. **2047** విజన్ డాక్యుమెంట్ ప్రకారం త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా ప్రపంచంతో పోటీ పడేందుకు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి. పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మెప్మా ద్వారా మున్సిపాలిటీల్లో మహిళలకు రూ.**6000** కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నగర రాజ్యాంగ అభివృద్ధి చెందుతుంది ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీని రూపొందించాం. హైదరాబాద్ బయట మున్సిపాలిటీల పరిధిలో అనేక క్లస్టర్లుగా విభజన చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం. రేర్ రూరల్ అగ్రి రీజనల్ ఎకానమీ ద్వారా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి మున్సిపాలిటీల సమీపంలోని గ్రామాల్లో ఉపాధి, ఆదాయం పొందేలా చేయడమే ప్రభుత్వం లక్ష్యం. గ్రామాల్లో ఉత్పత్తులకు మున్సిపాలిటీల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గతంలో రేషన్ కార్డుల కోసం చూసి చూసి అలసిపోయిన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు పంపిణీ చేశామని గుర్తుచేశారు. రాష్ట్రంలో **1.15** కోట్ల కుటుంబాలు ఉండగా **1.03** కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాము. బడుగు బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని అల్ప ఆదాయ వర్గాలకు **200** యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం వినియోగదారుల తరపున విద్యుత్ శాఖకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాము. హైదరాబాద్ పట్టణంలోనే కాకుండా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ డెవలప్మెంట్ కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశాం. ప్రపంచ స్థాయి విద్యను పేద బడుగు బలహీన వర్గాలకు అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# మేడారం జాతర వైద్య సేవలకు హై అలర్ట్

హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): ఈ నెల 28 నుంచి 31 వరకూ మేడారంలో జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతర గద్దెల వద్ద ఏర్పాటు చేసిన 50 పడకల హాస్పిటల్, మినీ హాస్పిటల్స్, ప్రధాన మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ వైద్యులను డిప్యూట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. జాతరలో ఏర్పాటు చేసిన 3 హాస్పిటళ్లు, 30 మెడికల్ క్యాంపులు, జాతరకు వెళ్లి ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన మరో 42 మెడికల్ క్యాంపుల్లో అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి ఆరా తీశారు. 3 హాస్పిటళ్లు, 72 మెడికల్ క్యాంపుల్లో కలిపి 544 మంది డాక్టర్లు సహా మొత్తం 3199 మంది సిబ్బందిని డిప్యూట్ చేశామని అధికారులు మంత్రికి వివరించారు.

### స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు

అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్, కన్జుమబుల్స్, ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంచుకున్నామని తెలిపారు. మేడారంలో గద్దెల వద్ద 50 పడకల హాస్పిటల్, జంపన్న వాగు వద్ద 6 బెడ్ల హాస్పిటల్, ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మరో మినీ హాస్పిటల్ ఏర్పాటు చేసి, స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ



11,625 మందికి వైద్య సేవలు అందించామని వెల్లడించారు. పేషెంట్లను తరలించడానికి (108) అంబులెన్స్‌లు 38,బైక్ అంబులెన్స్ 40 సిద్దంగా ఉంచుకున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాతరలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌పై నిఘా పెట్టాలని, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతరలో ఏర్పాటు చేసిన హాస్పిటల్స్, మెడికల్ క్యాంపుల లొకేషన్లు, ఇతర వివరాలు భక్తులకు తెలిసేలా, తక్షణమే అన్ని చోట్ల బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. జాతరలో ఏర్పాటు చేసిన 3 హాస్పిటల్స్, ముఖ్యమైన లొకేషన్లలో ఉన్న మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేయాలన్నారు. తక్షణమే మేడారం వెళ్లి, జాతర అయిపోయే వరకూ అక్కడే ఉండి పర్యవేక్షించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.

### రిఫరల్ హాస్పిటల్స్‌గా ములుగు జీజీహెచ్, ఎంజీఎం

జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులతో పాటు, వివిధ జిల్లాల నుంచి మేడారం చేరుకునే 8 ప్రధాన రూట్లలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపుల్లోనూ డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా 4 వీలర్, 2 వీలర్ అంబులెన్స్‌లు 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో నిమిషాల వ్యవధిలోనే పేషెంట్లను షిఫ్ట్ చేసి, వారికి వైద్యం అందించాలన్నారు. ఒకవేళ పేషెంట్‌కు హాస్పిటల్ కేర్ అవసరం పడితే, ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

### ప్రజలకు మంత్రి శుభాకాంక్షలు.. సూచన

బుధవారం నుంచి జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో సమ్మక్క, సారలమ్మ భక్తులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి గారితో కలిసి ఇటీవల మేడారం వెళ్లి తల్లులను దర్శించుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. జాతరకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకూ సొంతగానే ఫుడ్ ప్రిపేర్ చేసుకోవాలన్నారు. జాతరలో నాణ్యతలేని ఆహార పదార్థాలను కొనుగోలు చేయొద్దన్నారు. అనారోగ్య సమస్య వస్తే వెంటనే సమీపంలోని హెల్త్ క్యాంపునకు వెళ్లి, వైద్య సేవలు పొందాలని మంత్రి సూచించారు. అవసరమైతే 108 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

# ఆధార్ యూజర్లకు గుడ్ న్యూస్

మొదటి పేజీ తరువాయి

మరింత సులభంగా సేవలు లభించనున్నాయి.

### ఎక్కడైనా.. ఎప్పుడైనా

ఇప్పటి వరకు మొబైల్ నంబర్ మార్పు కోసం ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కొత్త విధానంతో ఆ అవసరం తగ్గనుంది. ఆధార్ దారులు తమకు అనుకూలమైన సమయంలో, అనుకూలమైన చోట నుంచే మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే అవకాశం లభించనుంది. దీంతో ఓటీపీ ఆధారిత ధృవీకరణ, ఆధార్ ఆథెంటికేషన్, ప్రభుత్వ పథకాల లబ్ధి వంటి సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండకుండా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

### డిజిటల్ సేవలకు మరింత ఊతం

ఆధార్‌కు సరైన మొబైల్ నంబర్ లింక్ అయి ఉండటం బ్యాంకింగ్, సబ్సిడీలు, ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలకు ఎంతో కీలకం. ఈ కొత్త సౌకర్యం వల్ల భారత్‌లో డిజిటల్ వ్యవస్థ మరింత బలపడనుందని ఉడై భావిస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, దూర ప్రాంతాల్లో నివసించే వారు, డిజిటల్ సేవలను ఎక్కువగా వినియోగించే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

### ఆధార్ యాప్ కీలక పాత్ర

ఈ కొత్త సదుపాయం అమలులో ఆధార్ మొబైల్ యాప్ కీలక పాత్ర పోషించనుంది. గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉన్న ఆధార్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉడై సూచిస్తోంది. ఈ యాప్ ద్వారా భద్రంగా, సులభంగా ఆధార్‌కు సంబంధించిన సేవలను పొందవచ్చు.

### డిజిటల్ ఇండియాకు మరో అడుగు

ఈ కొత్త మొబైల్ అప్‌డేట్ సౌకర్యంతో ఆధార్ సేవలు మరింత సమగ్రంగా, ప్రజలకనుగుణంగా మారనున్నాయి. పౌరులకు డిజిటల్ సేవలు మరింత సులభంగా అందించాలన్న ఉడై లక్ష్యంలో ఇది మరో కీలక అడుగుగా భావిస్తున్నారు.

# సిట్ విచారణకు హాజరైన బీఆర్ఎస్ నేత సంతోష్ రావు

మొదటి పేజీ తరువాయి

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. 3 గంటలకు ఆయన విచారణ ప్రారంభమైంది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసిన వ్యవహారంలో ఇప్పటికే కేటీఆర్, హరీష్ రావులను అధికారులు ప్రశ్నించారు. కీలక సమాచారం చేరవేయడంలో సంతోష్ రావు పాత్రపై ఆరా తీసేందుకు ఈ నోటీసులు ఇచ్చారు. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘన మరియు అధికార దుర్వినియోగం ఆరోపణల చుట్టూ తిరుగుతున్న ఈ కేసు విచారణ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. కేటీఆర్, హరీష్‌రావులను కూడా అధికారులు సుదీర్ఘంగా విచారించిన సంగతి తెలిసిందే. కీలక సమాచారం సేకరించే ప్రక్రియలో భాగంగా సంతోష్ రావును విచారించడం ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సమ్మక్క- సారలమ్మ జాతరకు సర్వం సిద్ధం

తెలంగాణ బ్యూరో, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లేవారికి, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు అమ్మవార్ల దర్శనంతో కృపకు పాత్రులై, ఆధ్యాత్మిక శాంతిని పొందాలని సీఎం ఆకాంక్షించారు. దర్శనానంతరం ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. మేడారం జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని సీఎం తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. జాతర ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలు అత్యంత ప్రాధాన్యంగా ఉండాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

# శాంతిభద్రతలు క్షీణించాయి



హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులకు తిరిగి వెపన్స్ ఇవ్వాలని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితని ఆమె కుటుంబ సభ్యులను అడిగి పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, నేరగాళ్లు విచ్చలవిడితనంగా రెచ్చిపోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గృహ హింస పెరిగిపోతోందని, మహిళా అధికారులకే రక్షణ లేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. నేరస్థులకు చట్టాలన్నా, పోలీసులన్నా భయం లేకుండా పోయిందని మండిపడ్డారు. ఎక్సైజ్ పోలీసులు అంటే గంజాయి సరఫరా చేసేవారికి, స్మగ్లర్లకు అస్సలు భయం లేకుండాపోతోందని అన్నారు. అందుకు నిజామాబాద్ ఘటనే అద్దం పడుతోందని పేర్కొన్నారు.

### వెపన్స్ ఉంటేనే భయపడతారు

నేరగాళ్లను కట్టడి చేయాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎక్సైజ్, ఫారెస్ట్ అధికారులకు ఉన్న ఆయుధాలను తిరిగి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారుల దగ్గర వెపన్స్ ఉంటేనే స్మగ్లర్లు, అసాంఘిక శక్తులు భయపడతారని ఆమె అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో దాడులకు గురవుతున్న అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాలని, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని కోరారు. తెలంగాణలో శాంతిభద్రతలను కాపాడటంలో రేవంత్ సర్కార్ తక్షణమే స్పందించి, పోలీసు యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

### రేవంత్ రెడ్డికి స్పై సంతోష్‌రావు

సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్ రావు గూఢచారిగా పని చేస్తున్నారని కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉద్యమనేత కేసీఆర్‌తో ఉద్యమకారులను కలవనివ్వకుండా చేసిందే అతడని ఆ పాపం ఊరికే పోదని అన్నారు. గద్దర్‌లాంటి వాళ్లు ప్రగతిభవన్ గేట్ బయట పడిగాపులు కాయాల్సిన పరిస్థితి కలగుజేసింది అతడేనని అన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సగం ఇడ్లి తిన్నారా పూర్తిగా ఇడ్లి తిన్నారా? అన్న సమాచారాన్ని కూడా గుంపు మేస్త్రీకి చేరవేసేది సంతోష్ రావేనని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అతడి గుఢచారిని రేవంత్ రెడ్డి శిక్షిస్తాడని తాను నమ్మడం లేదన్నారు. ఇక సంతోష్‌రావు లాంటి దుర్మార్గుడికి కేటీఆర్, హరీష్ రావు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని కవిత అన్నారు.

# మేడారం జాతరకు విద్యుత్‌శాఖ సర్వం సిద్ధం

**ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్**

**నాలుగు వేర్వేరు మార్గాల నుండి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

**రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీతో 106 ట్రాన్స్‌ఫార్మర్ల పర్యవేక్షణ**

**సిబ్బందికి ఎన్పీడీసీఎల్ లోగో టి-షర్టుల పంపిణీ**



తాడ్వాయి, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన విద్యుత్ అధికారులతో మేడారంలో పర్యటించి విద్యుత్ సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 132 కెవి కమలాపూర్, పస్రా, ములుగు నుండి వచ్చే 33 కెవి నాలుగు వేర్వేరు మార్గాల నుండి ప్రత్యామ్నాయ సరఫరా కోసం డి.పి. స్ట్రక్చర్‌తో కూడిన 8 పోల్ వ్యవస్థను పర్యవేక్షించారు. 106 ట్రాన్స్‌ఫార్మర్లను నేరుగా సబ్ స్టేషన్ నుండి మానిటర్ చేసేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, దీని ద్వారా సమస్యను తక్షణమే గుర్తించి సరిచేయవచ్చని తెలిపారు. జాతర విధుల్లో ఉండే సిబ్బంది కోసం 55 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వీరికి ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు పర్యవేక్షకులుగా ఉంటారు. సమ్మక్క సబ్ స్టేషన్ వద్ద సిబ్బందికి ఎన్పీడీసీఎల్ లోగోతో కూడిన టి-షర్టులను సీఎండీ పంపిణీ చేశారు. నిరంతర విద్యుత్ సరఫరా ను ఎప్పటికప్పుడు మానిటర్ చేయడానికి 600 మంది సిబ్బందిని జాతర కొరకు నియమించడం జరిగిందని చెప్పారు. వీరందరికి అన్ని వసతులు ఏర్పాటు చేశామని 70 టెంట్లను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. తాడ్వాయి, పస్రా సబ్ స్టేషన్లను సందర్శించిన సీఎండీ కొత్తగా నిర్మిస్తున్న సెక్షన్ ఆఫీస్ మరియు గట్టమ్మ వద్ద సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో, డైరెక్టర్లు వి. మోహన్ రావు టి. మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ కె. రాజు చౌహాన్, సీఈ ఐటి శ్రవణ్ కుమార్, జియం ఐటి శ్రీనివాస్, ములుగు ఎస్ఈ ఆనందం, భూపాలపల్లి ఎస్ ఈ మల్చూరు, డిఈ ములుగు పి . నాగేశ్వర రావు, డిఈ ఎంఆర్టీ, కంస్ట్రక్షన్ సదానందం, డ.ఈ టెక్నికల్ భాస్కర్, ఈ ఈ సివిల్ వెంకట్ రామ్, ఏడీఈలు రాజేష్ , వేణుగోపాల్, సందీప్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## వీసీ అవార్డు గ్రహీతకు ఘనంగా సన్మానం



హనుమకొండ కేయు, జనవరి 27 (తీన్మార్ న్యూస్): వైస్ ఛాన్సలర్ అవార్డు గ్రహీతకు కేయూ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం

కాకతీయ విశ్వవిద్యాలయంలో నిన్న నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బెస్ట్ రీసెర్చ్ పేపర్ విభాగంలో వైస్ ఛాన్సలర్ అవార్డును అందుకున్న పార్ట్ టైం అధ్యాపకులు డా. పోరిక మహేందర్ కి, బయోటెక్నాలజీ విభాగంలో కేయూ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. శాస్త్రి సార్ మాట్లాడుతూ ప్రతిభ ఎవరి స్వంతం కాదు. కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు వస్తుంది అని పేర్కొంటూ, అన్ని విభాగాల అధ్యాపకులు పోటీతత్వాన్ని పెంచుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా డా. ఎం.కె. సుమంత్ మాట్లాడుతూ, బయోటెక్నాలజీ విభాగ స్థాపకులు ప్రొఫెసర్ సుభాష్ గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన నెలకొల్పిన అకడమిక్ విలువలు, ప్రతిభా ప్రమాణాలను కొనసాగిస్తూ డా. పోరిక మహేందర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ, అంతటి గొప్పవాడివి కావాలి మహేందర్ అని ప్రశంసించారు. కేయూ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్ గౌడ్, కార్యదర్శి డా. కొత్తపల్లి నాగేశ్వరరావులు మాట్లాడుతూ, డా. పోరిక మహేందర్ ప్రతిభను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రంకి, అలాగే విశ్వవిద్యాలయ అధికారులకు సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ జాయింట్ డైరెక్టర్లు డా. సుమంత్, డా. వడ్డేపల్లి మోహన్, సీనియర్ అధ్యాపకులు తిరునారి శేషు మాట్లాడుతూ, డా. పోరిక మహేందర్ ప్రతిభను గుర్తించిన విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డా. ఫణిందర్, డా. ప్రగతి, డా. సాహితి, డా. శ్యాంసుందర్ చారి, డా. సాయిడా, డా. రజినీకాంత్, డా. బాలకృష్ణ, డా. రవీందర్, డా. సుధాకర్, డా. నివాస్, జ్యోత్స్నా తదితర పార్ట్ టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేసిఆర్ హయాంలో ప్రజలందరికి న్యాయం జరిగింది

**26 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధులు రూపాయి రాలేదు**

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**



భూపాలపల్లి, జనవరి 27 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని 5వవార్డు కృష్ణా కాలనీలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బస్తీ బాట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి 5వ వార్డు కృష్ణ కాలనీలో ఇంటింటా తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కాలనీలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కాలనీలోని ఓ మహిళ తన ఇంటి ముందు కరెంట్ పోల్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పలుమార్లు అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే రమణన్నకు తన గోడును వెళ్లబోసుకుంది. అలాగే కాలనీ వాసులు మాట్లాడుతూ కృష్ణ కాలనీకి పట్టాలు ఇచ్చిన ఘనత, ప్రతి ఇంటికి తాగునీరు అందించి రోడ్లు వేయించిన ఘనత అంతా రమణా రెడ్డిది అంటూ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ కాలనీలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తున్నా పారిశుధ్య నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాలనీ వాసుల సౌకర్యార్థం నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో సింగరేణి పర్యవేక్షణ లేకుండా పోయిందని,ప్రస్తుతం అది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణ కాలనీలో చెత్త పేరుకుపోయిన పట్టించుకునే వాడే లేడని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేకు, భూపాలపల్లికి వస్తున్న మంత్రులకు ఇవన్నీ కనబడడం లేదా అని ప్రశ్నించారు. విమర్శకు ప్రతి విమర్శ సమాధానం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించే పనులు చేయాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కృష్ణ కాలనీలోని భూములను సింగరేణి నేరుగా ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రత్యేక జీవో ద్వారా భూములు ఇప్పించి,ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ కూడా చేయించి కాలనీ వాసులకు అందించామని, అలాగే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛమైన గోదావరి జలాలను సరఫరా చేసి కాలనీ వాసుల నీటి కష్టాలను తీర్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనేక హామీలు ఇచ్చి వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పోరాటం ఆగదని, కాలనీ వాసుల తరపున తాను ఎప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో మంత్రులు అందరూ భూపాలపల్లి బాట పట్టారు అని ఒక్కసారి నమ్మి ఓటేసిన పాపానికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, భూపాలపల్లిలో అభివృద్ధి పేరిట జరిగే పనులకు నిధులు మంజూరు అయినయో లేదో అనే సందేహాన్ని వ్యక్తం చేస్తూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న, ప్రజలను మాయ మాటలతో మోసం చేసే నాయకులకు బుద్ధి చెప్పాలన్న రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల కారు గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ చెంప పగలకొట్టాలి అని కోరారు.





## మేడారం జాతర సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీతక్క శుభాకాంక్షలు



ములుగు జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తరలివచ్చే కోట్లాది భక్తులందరికీ మంత్రి సీతక్క హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచె ఈ మహాజాతర ప్రతి భక్తుడి హృదయంలో భక్తి భావాన్ని నింపాలని, జీవితంలో ఎదురయ్యే కష్టాలు తొలగిపోయి శాంతి, ఆనందం కలగాలని ఆమె ఆకాంక్షించారు. సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనంతో ప్రజలందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, సమృద్ధి ప్రసాదించాలని ప్రార్థించారు. భక్తుల సౌకర్యం, భద్రత కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. రవాణా, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులు సమకూర్చామని పేర్కొన్నారు. భక్తులందరూ సురక్షితంగా దర్శనం చేసుకుని ప్రశాంతంగా తిరిగి వెళ్లాలని ఆమె కోరారు. సమ్మక్క సారలమ్మ తల్లుల ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరికీ శుభం కలగాలని మంత్రి సీతక్క తన ప్రకటనలో పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి





వరంగల్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మంగళవారం గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ మరియు 16వ డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకముందు కట్టమల్లన్న మల్లికార్జున స్వామీ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. 16వ డివిజన్ కీర్తి నగర్ లో వాసవి మాతా కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించారు. జాన్ పాకలో సి సి రోడ్డు, సి సి డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 15వ డివిజన్ గొర్రెగుంట లో సీసీ రోడ్డు మరియు సిసి డ్రెయిన్ నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. పోతరాజు పల్లి గ్రామంలో వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన మొగిలిచర్ల గ్రామంలో సిసి రోడ్డు మరియు అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రకటన




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు భూపాలపల్లి మున్సిపాలిటీకి నిర్వహించనున్న 2వ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో మాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఎలాంటి పొరపాటుకు తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ ఆదేశించారు.


## సోదా అనిత రామకృష్ణకు సన్మానం



పరకాల, జనవరి 27 (తీన్మార్ న్యూస్): సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు చైర్మన్ నరేంద్ర ఫతక్ వారి బృందం లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులైన పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణని లైన్స్ క్లబ్ పట్ల వారు చేసిన సేవలను కొనియాడుతూ హనుమకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ వారు సంజయ్ సింగ్, హలో కుమార్ జా, వివేకనందు జా, విజస్, దేవేందర్ సింగ్, నవీన్ చా, రాజేష్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని



వరంగల్ జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో పారదర్శకమైన మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డి. జి. పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు- కలెక్టర్లు, జిల్లా అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉ ంటుందని, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, జోనల్, నోడల్ అధికారులు, పర్యవేక్షణ బృందాలు, పి ఓ లు, ఎ పి ఓ లు, ఎన్నికల సిబ్బంది నియామకం ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలని ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి – కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలోని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సంపేట 30, వర్ధన్నపేట 12 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పి ఓ లు, ఓ పి ఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధారా కవిత, జిల్లా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, నర్సంపేట వరంగల్ ఆర్డీవోలు సుమ ఉమా రాణి, నర్సంపేట వర్ధన్నపేట వర్ధన్నపేటకమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి, రంజాన్ ఏర్పాట్లపై సమన్వయ సమావేశం




వరంగల్ జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం మహాశివరాత్రి, రంజాన్ ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై వేద పండితులు, ముస్లిం పెద్దలు, జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అధికారులు హాజరై మహాశివరాత్రి, రంజాన్ పర్వదినాల సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 15న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పిబ్రవరిలో నెలలో ప్రారంభమయ్యే రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లలో భాగంగా దేవాలయాలు, మసీదుల వద్ద కలరింగ్, లైటింగ్, క్లీనింగ్, తాగునీటి సౌకర్యాలు, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు బందోబస్తు వంటి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాధాన్యత ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ బల్దియా తరపున చేయవలసిన ఏర్పాట్లను చేపడతామని మున్సిపల్ వాటర్ సప్లైను సమయానుకూలంగా విడుదల చేయుటకు ప్రయత్నం చేస్తామని, అవే కాకుండా మున్సిపల్ పరిధిలో చేయవలసిన అన్ని ఏర్పాట్లను చేయుటకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డిసిపి ధారా కవిత మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా బందోబస్తు ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రాంరెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ అధికారి రమేష్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉ మారాణి, సంబంధిత జిల్లా అధికారులు, వేద పండితులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్టర్ వాటర్ పర్మిషన్ లేని వాటిపై చర్యలు తీసుకోవాలి

## ఎలిగేండ్ల వెంకటేష్ ముదిరాజ్




మహబూబ్ నగర్ జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగేండ్ల వెంకటేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఫిల్టర్ వాటర్ పర్మిషన్ లేని వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అందులో మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఫిల్టర్ వాటర్ నిర్వహిస్తున్న వారు చాలామంది ఉన్న,వాటిలో ఏ ఒక్కరు కూడా ఫిల్టర్ వాటర్ నడుపుతున్న వారు మున్సిపాలిటీ నుండి ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్నారు. కావున వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, ప్రతి ఒక్క ఫిల్టర్ వాటర్ సంబంధించిన స్థలాన్ని అధికారులు పరిశీలించి, తనిఖీలు చేసి, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని,అలాగే ఒక లీటరు వాటర్ బాటిల్ మరియు 1/2 లీటరు వాటర్ బాటిల్ లను ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా అమ్ముతున్న వాటిపై కూడా తనిఖీలు నిర్వహించి, వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు ఏర్పుల నాగరాజు, మహబూబ్ నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ నుంచి భారత్ మత్స్యకారుల విడుదల

## ముగిసిన నాలుగు నెలల నిర్బంధం

## స్వదేశానికి ఉత్తరాంధ్ర మత్స్యకారులు



తెలంగాణ డెస్క్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): బంగ్లాదేశ్ జైలు నుంచి 23 మంది భారతీయ మత్స్యకారులకు విముక్తి లభించింది. ఉత్తరాంధ్రకు చెందిన 9 మందికి విడుదలతో ఆ కుటుంబాల్లో ఆనందం నెలకొంది. బంగ్లాదేశ్ జైల్లో బందీలుగా ఉన్న ఉత్తరాంధ్ర మత్స్యకారులకు ఎట్టకేలకు విముక్తి లభించింది. ద్వైపాక్షిక ఒప్పందాల మేరకు బంగ్లాదేశ్ హోం మంత్రిత్వశాఖ 23 మంది భారతీయ మత్స్యకారులను విడుదల చేసింది. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన 9 మంది, పశ్చిమ బెంగాల్‌కు చెందిన 14 మంది మత్స్యకారులు ఉన్నారు. బాగర్హాట్ జైల్‌లో నిర్బంధంలో ఉన్న ఈ మత్స్యకారులను విడుదల చేసిన అనంతరం, అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య మోంగ్లా పోర్టుకు తరలించారు. బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ స్వాధీనం చేసుకున్న బోటుకు మరమ్మతులు పూర్తయ్యాక, నేడు వీరంతా బోటు ద్వారా తిరుగు ప్రయాణం కానున్నారు. అయితే, గత ఏడాది అక్టోబర్ నెలలో పశ్చిమ బెంగాల్ తీరంలో వేట సాగిస్తున్న సమయంలో, అనుకోకుండా అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించడంతో బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ మత్స్యకారులను అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి వీరు జైలులోనే గడుపుతున్నారు. విడుదల వార్తతో ఉత్తరాంధ్ర మత్స్యకార కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. తమ వారి రాక కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. భారత ప్రభుత్వ జోక్యం, ద్వైపాక్షిక చర్చల వల్లే ఈ విముక్తి సాధ్యమైందని వారు భావోద్వేగంగా చెప్పారు.

# మునిసిపల్ ఎన్నికలను వాయిదా వేయాలి

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్



భూపాలపల్లి, జనవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మునిసిపల్ ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు జాతరకు తరలివెళ్తున్నారని తెలిపారు. భారతదేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర జరుగుతున్న సమయంలో, రేపటి నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. మేడారం జాతరలో పాల్గొనే ప్రజలు, అభ్యర్థులు, ప్రపోజర్లు, వార్డు సభ్యులు అందరూ జాతరకు వెళ్లే పరిస్థితి ఉన్నందున, నామినేషన్ ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరియు ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి మునిసిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను వాయిదా వేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతరను విజయవంతం చేద్దాం

## జాతరకు వచ్చే భక్తులకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం





ఆత్మకూరు, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మంగళవారం ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంతకుముందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసామన్నారు. జాతర వచ్చే భక్తులు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. భక్తుల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, విద్యుత్ వంటి అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు హెల్మెట్లను పంపిణీ చేశారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం


## రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్




ములుగు, జనవరి 27 (తీన్మార్ న్యూస్): క్రీడల్లో గెలుపోటములు సహజమని రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా బండారుపల్లి జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్ హాజరై క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మంచి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని అన్నారు. సమాజంలో చదువు అన్నిటికీ మూలమని, విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. అనంతరం బాదం ప్రవీణ్ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు బాదం ప్రవీణ్ ను శాలువాలతో సత్కరించారు.

# తెలంగాణలో బీజేపీకి అధికారం కల కల్ల

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
## ముగిసిన బీఆర్ఎస్ అధ్యాయం
## సొంత పార్టీ ఆలోచనలో కవిత



హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): బీజేపీ ఎంత కొట్లాడినా తెలంగాణలో అధికారంలోకి రాదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కర్ణాటక, తెలంగాణ లో బీజేపీ లేదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న పీసీసీ చీఫ్ అక్కడ మంగళవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీతో పాటు బీఆర్ఎ ఎస్ పని కూడా అయిపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్మా ణంపై స్పందిస్తూ ఇంకా 2 డీసీసీ ప్రెసిడెంట్లు, మహిళా అధ్యక్షురాలి ఎంపిక పెండింగ్లో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో నిజామాబా ద్లో బీఆర్ఎస్ లేదన్నారు. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉందన్నారు. కవిత సొంత పార్టీ పెట్టి పోటీ చేసే ఆలోచనలో ఉన్నదన్నారు. నైనీ కోల్ బ్లాక్ పంచాయతీ మీడియా సృష్టేనని కొట్టిపారేశారు. ఈ అంశంపై కేసీ వేణుగోపాల్ వద్ద ఎలాంటి చర్చ జరగలేదన్నారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు

## న్యాయవాదుల సంక్షేమమే లక్ష్యం
## ప్రచారంలో జోరు పెంచిన రోహిత్ పాల్



హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టులో త్వరలో జరగబోయే బార్ కౌన్సిల్ ఎన్నికల హోరు నడుస్తోంది. గెలుపే లక్ష్యంగా న్యాయవాదులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల్లో న్యాయవాది రోహిత్ పాల్ సింగ్ ప్రభంజనం కొనసాగుతోంది. యువ న్యాయవాదిగా తను ఎదుర్కొన్న కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు వేరొక న్యాయవాది ఎదుర్కో వద్దు అని న్యాయవాది రోహిత్ అన్నారు.

**యువ న్యాయవాదులకు ప్రోత్సాహం**

యువ న్యాయవాదులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం లభించాలని గట్టిగా పోరాడటానికి తాను సిద్ధంగా ఉన్నానని, తన జీవితం న్యాయవాదుల సేవకు అంకితం చేస్తానని తెలిపారు. వివిధ జిల్లాల పర్యటనలో యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను నిశితంగా పరిశీలించినట్లు వెల్లడించారు. వారికి తగిన ప్రభుత్వం, బార్ అసోసియేషన్ తరపున వచ్చే ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. బార్ కౌన్సిల్లో యువత గళం కావాలంటే ఇదే సమయం బార్ కౌన్సిల్ ఎన్నికల్లో యువ న్యాయవాదులు తప్పని సరి పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకొని పిలుపునిచ్చాడు. కాగా, ఐదేండ్లకు ఒకసారి జరిగే తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికలు జనవరి 30న జరగనున్నాయి. 25 మంది సభ్యులను ఎన్నుకోవడానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 56 వేల మంది న్యాయవాదులు ఓటు వేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఐదుగురు మహిళా సభ్యులను ఎన్నుకోనున్నారు.

# తెలంగాణ శాసనసభలో "జపాన్ బృందం సందర్శన"


## రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులపై కీలక చర్చలు



హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ శాసనసభను జపాన్ దేశంలోని అయిచి రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల బృందంతో కూడిన అయిచి ఎకనామిక్ డెవలప్మెంట్ ఫోరం బృందం మంగళవారం సందర్శించింది. ఫోరం చైర్మన్ హిరిహితో కోండో, తొమ్మిది మంది అయిచి రాష్ట్ర ఎమ్మెల్యేల బృందానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పీకర్ ఛాంబర్ లో సమావేశమైన తెలంగాణ- అయిచి రాష్ట్ర సభ్యుల బృందం, వివిధ రంగాలలో సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్నతమైనవి తెలంగాణ 2014 లో నూతనంగా ఏర్పడినదని శాసనసభలో 119 మంది సభ్యులు, శాసన మండలిలో 40 మంది సభ్యులు ఉన్నారని వివరించారు. ఎమ్మెల్యేలను ఎన్నికల ద్వారా నేరుగా ప్రజలు ఎన్నుకుంటారు. తెలంగాణ అసెంబ్లీలో చర్చలు అర్థవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడానికి కృషి చేస్తున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత్, జపాన్ దేశాల మధ్య మొదటి నుంచి చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడినప్పటికీ పెట్టుబడులకు అన్ని విధాలుగా మంచి వాతావరణం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జపాన్ బృంద సభ్యులకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

## ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరుపుటకు ఏర్పాట్లు
## రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని







జనగామ జిల్లా, జనవరి 27 (తీన్మార్ న్యూస్): మున్సిపాలిటీ ఎన్నికలను సమర్థవంతంగా, శాంతియుతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, రాష్ట్ర డి.జి.పి. శ్రీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలలు, మున్సిపల్ కమీషనర్లతో మున్సిపాలటి ఎన్నికల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ రాష్ట్రంలో 116 మున్సిపాలటీలు, 7 కార్పొ రేషన్లకు ఎన్నికల నిర్వహణలకు సన్నద్ధంగా ఉండాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన క్షణం నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట అమల్లోకి వస్తుందని తెలిపారు. అలాగే ఎన్నికల నియమ నిబంధలకు అనుగుణంగా వ్యవహరించి, ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ బూతులలో అవసరమైన అన్ని ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీలలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూడాలని అన్నారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాటకు అవసరమైన కార్యచరణ ప్రణాళికలను సిద్ధంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల విజయవంతంగా నిర్వహించారని, అలాగే మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయలన్నారు. విదుల్లో ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి శివదర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసు శాఖ పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో తగినంత సిబ్బందిని నియమిస్తామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల ప్రవర్తన నియమావళినికి అనుగుణంగా ఎన్నికలను నిర్వహించేందుకు పక్క ప్రణాళికలను సిద్ధం చేయాలని, ఎన్నికల సామాగ్రిని పరిశీలన అలాగే సిబ్బంది కేటాయింపు తదితర అంశాలపై ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిసిపి రాజమహేంద్ర నాయక్, జెడ్పీ సిఇఓ మాదురిష, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ కమీషనర్లు మహేశ్వర్ రెడ్డి, రాధాకృష్ణ, ఇతర శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లలో సమస్యలు తీరలేదు



నల్గొండ, జనవరి 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తొలి పదేళ్లలో మన సమస్యలు తీరలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బొట్టుగూడలో 'కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్' ఆధ్వర్యంలో రూ. 8 కోట్ల వ్యయంతో నిర్మించిన పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్‌తో పాటు ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సరైన విద్య అందితేనే పేదల సమస్యలు తొలుగుతాయని అన్నారు. విద్యపై ప్రభుత్వం ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. నల్లగొండలోని బొట్టుగూడ పాఠశాలను ఒక మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. బొట్టుగూడ స్కూల్ వంటి ప్రభుత్వ పాఠశాల దేశం మొత్తంలో ఎక్కడా లేదని, మరెక్కడా కనిపించదని పేర్కొన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు, క్రీడా సదుపాయాలు కల్పించామని చెప్పారు. మన విద్యార్థులకు మార్కులు బాగా వస్తున్నా ఉద్యోగాల సమయంలో అవసరమైన నైపుణ్యాలు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విషయంపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**శ్రీ చైతన్య, నారాయణ సంస్థలు దొంగలు**

ఇక స్కూళ్లలో అడ్మీషన్ల సీజన్ వస్తే తనకు భయం వేస్తుందని శ్రీచైతన్య, నారాయణ సంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ దొంగలుగా తయారు అయ్యారని కామెంట్ చేశారు. తన దగ్గరకు రికమెండేషన్ కోసం వచ్చిన వారికి రూ.3 లక్షల ఫీజు చెప్పి రూ.2లక్షలకు తగ్గిస్తున్నారని, అసలు ఫీజు రూ.2 లక్షలేనని అన్నారు. విద్య వ్యాపారం కాదని ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా 25 శాతం పేద విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని చట్టంలో ఉందన్నారు. కానీ, ఆ చట్టాలకు తూట్లు పొడిచి నేడు కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల పేరుతో పేదోళ్ల రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాయని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

**నేనే విద్యాశాఖ మంత్రి అయితే.. కార్పొరేట్ విద్యా సంస్థలు బంద్ చేస్తా**

ప్రైవేటు స్కూళ్లు, కళాశాల్లో డిగ్రీ, ఇంటర్ చదవిన వాళ్లు టీచర్లుగా పాఠాలు చెబుతున్నారని, అదే ప్రభుత్వం స్కూళ్లలో బీఈడీ చేసి టెట్, డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యను బట్టీ పట్టించడం వల్ల ఉన్నత చదువులకు వెళ్లిన వాళ్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. తనకు విద్యా శాఖ మంత్రిగా అవకాశం వస్తే కార్పొరేట్ విద్యా సంస్థలను బంద్ చేయడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

# సింగరేణిలో భారీ బొగ్గు కుంభకోణం

## గవర్నర్‌కు కేటీఆర్ బృందం ఫిర్యాదు
## సమగ్ర విచారణకు బీఆర్ఎస్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 27 (తీన్మార్ న్యూస్): సింగరేణిలో బొగ్గు స్కామ్ జరిగిందని ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను బీఆర్ఎస్ నేతలు కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం మంగళవారం లోక్ భవన్‌లో గవర్నర్ ను కలిసి సింగరేణిలో బొగ్గుస్కామ్ జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించిన వివరాలను గవర్నర్ కు అందజేశారు. అనంతరం లోక్ భవన్ బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ. 10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఇప్పటికే ప్రజలతో ఆడుకుంటున్న సీఎం సింగరేణి సంస్థతో కూడా ఫుట్ బాల్ ఆడుతున్నారని ఆరోపించారు.

**కాంగ్రెస్ లో వణుకు మొదలైంది:**

సీఎం అంటే కోల్ మాఫీయాకు నాయకుడిగా భావించే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఆధారాలతో సహా భయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైందని ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని విమర్శించారు. ఆధారాలతో కుంభకోణాలు బయటపెట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారని ఆరోపించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారన్నారు.



# వేతన సవరణ, ఐదురోజుల పనిదినాలు

**బ్యాంక్ ఉద్యోగుల సమ్మెతో స్తంభించిన బ్యాంకు కార్యకలాపాలు**



**న్యూఢిల్లీ :** ఐదురోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగులు మంఘలవారందేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టారు. దీంతో బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. . చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ ముఖ్యమైన డిమాండ్లు నెరవేర్చాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఈ సమ్మెకు దిగాయి. బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లలో ప్రధానంగా.. వారానికి ఐదు రోజుల పని దినాలు, వేతనాల పెంపు, పెన్షన్ సంస్కరణలు, 12వ ద్వైపాక్షిక వేతన ఒప్పందం పూర్తిగా అమలు కావాలన్నవి ఉన్నాయి. అంతేకాదు, ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణకు నిరసన, ఆటోమేషన్, ఔట్‌సోర్సింగ్ వల్ల ఉద్యోగాలపై వస్తున్న ముప్పు, పని ఒత్తిడి తగ్గించాలని, మెరుగైన వర్కింగ్ కండిషన్స్ ఉండాలని, సిబ్బంది కొరత తీర్చాలని, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ లేదా మెరుగైన పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులు కోరుతున్నారు. ఈ డిమాండ్లపై జరిపిన చర్చలు ఫలించకపోవడంతో ఒక రోజు దేశవ్యాప్త సమ్మెకు దిగారు. సమ్మె కారణంగా దేశంలోని దాదాపు అన్ని పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల శాఖలు మూసివేశారు. దీంతో బ్యాంకు ఖాతా దార్లకు పరిమిత సేవలు మాత్రమే ఇవాళ అందుబాటులో ఉన్నాయి.

ఫలితంగా దేశ వ్యాప్తంగా బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యాపారులు, పెన్షనర్లు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

# ఏఐ సాయంతో తను పోలిన నకిలీ మూవీ

**ఢిల్లీ హైకోర్టులో అకీరా నందన్ పిటిష్**



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు అకీరా నందన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఓ సినిమాతో తన వ్యక్తిత్వం, గోప్యతా హక్కులను ఉల్లంఘించారని తన పిటిషన్‌లో ఆరోపించాడు. ఏఐ మార్ఫింగ్ డీప్ ఫేక్ టెక్నాలజీతో రూపొందించిన ఈ సినిమాలో తన ముఖ కవళికలు, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించారని పిటిషన్‌లో అకీరా పేర్కొన్నాడు . ఏఐ సినిమాతో పాటు, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పెద్ద సంఖ్యలో తన పేరుతో నకిలీ ప్రొఫైల్స్, సోషల్ మీడియా పేజీలు ఉన్నాయని, వాటిని తొలగించాలని హైకోర్టును అకీరా నందన్ అభ్యర్థించాడు. అతడి పిటిషన్ స్వీకరించిన హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఎఐ సాయంతో తీసిన ఓ లవ్ స్టోరి సినిమాపై హైకోర్టు నిషేధం విధించింది. కృత్రిమ మేధస్సు, డీప్ ఫేక్ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా అకీరా నందన్ పేరు, ఇమేజ్, పోలిక, స్వరం, వ్యక్తిత్వాన్ని ఉపయోగించడం దోపిడీ చేయడమేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వక్రీకరించిన కంటెంట్‌ను రూపొందించడం అతని గోప్యతా హక్కును ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. వీడియోకు సంబంధించిన సోషల్ మీడియా ఖాతాలు తొలగించాలని, ఐపి వివరాలను బహిర్గతం చేయాలని మెటా, యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్, ఫేస్ బుక్ , ఎక్స్ సంస్థలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణ జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ముందు జరిగింది. అకీరా నందన్ తరఫున సీనియర్ న్యాయవాది సాయి దీపక్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. గూగుల్ తరఫున ఆదిత్యా గుప్తా, మెటా తరఫున వరుణ్ పాఠక్ న్యాయవాదులు కోర్టులో హాజరయ్యారు.

# యాసిడ్ దాడుల కేసులో కీలక మలుపు

**నిందితుల ఆస్తులు వేలం వేసి, బాధితులకు పరిహారం**

**సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ :** యాసిడ్ దాడుల కేసుల్లో బాధితులకు అండగా సుప్రీం కోర్టు నిలిచింది. వారికి అందచేస్తున్న పరిహారం సరిపోదని అభిప్రాయపడింది. నిందితుల ఆస్తులను వేలం వేసి బాధితులకు పరిహారంగా ఎందుకు ఇవ్వకూడదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. జీవితాంతం చికిత్స, పునరావాసం కోసం ప్రస్తుతం బాధితులకు అందజేస్తున్న పరిహారం కనీసం రూ. 3 లక్షలు సరిపోదని పేర్కొంది. ఈ విషయంలో మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. ఈ దారుణమైన నేరాలను నివారించేందుకు అసాధారణమైన శిక్షలు అవసరమని, ఈ దిశగా చట్టంలో మార్పులు చేయాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సూచన చేశారు. యాసిడ్ దాడి బాధితురాలు షాహీన్ మాలిక్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారించింది. బలవంతంగా యాసిడ్ తాగించిన ఘటనల్లో బాధితులకు తగిన పరిహారం, వైద్య సంరక్షణ సహా ఇతర ఉపశమనాలు లభించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తనపై జరిగిన యాసిడ్ దాడి కేసులో ఇప్పటికే 16 ఏళ్లు పోరాడానని, కానీ.. ట్రయల్ కోర్టులో నిందితులందరూ నిర్దోషులుగా విడుదలయ్యారని ఆమె ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసులో పోరాడుతూ తన జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయానని చెప్పారు. అయితే.. బాధితురాలి తరఫున హైకోర్టులో మంచి న్యాయవాది ఈ కేసును వాదించేలా సర్వోన్నత న్యాయస్థానం చర్యలు తీసుకుంటుందని సీజేఐ హామీ ఇచ్చారు. ఏడాది వారీగా యాసిడ్ దాడుల కేసులు, కోర్టుల్లో వాటి ప్రస్తుత స్థితి, బాధితుల కోసం చేపట్టిన పునరావాస కార్యక్రమాల వంటి వివరాలను అందజేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు ఆదేశించింది. బాధితులతో బలవంతంగా యాసిడ్ తాగించిన కేసుల వివరాలను కూడా అందించాలని చెప్పింది. బాధితుల విద్యార్హత, ఉద్యోగం, వైవాహిక స్థితి, వైద్య చికిత్స, దానికి అయిన లేదా అయ్యే ఖర్చుల వివరాలను కూడా సమర్పించాలని తెలిపింది. నాలుగు వారాల్లోగా వివరాలను అందజేయాలని ఆదేశించింది.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

## భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం కుదిరిందన్న ప్రధాని మోడీ

## వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు



**న్యూఢిల్లీ :** భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్- 2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. ఈ ఒప్పందంతో భారత్, ఐరోపా ప్రజలకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోనే పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయానికి నిదర్శనం. ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ప్రపంచవాణిజ్యంలో ఇది మూడోవంతుకు సమానం. ఈ డీల్ ఇరువర్గాల మధ్య వాణిజ్యాన్ని పెంపొందించడమేగాకుండా.. ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనపై మన నిబద్ధతను బలోపేతం చేస్తుందని మోదీ వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం హైదరాబాద్ హౌస్‌లో మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయన్ సమావేశమయ్యారు. వారు ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు. మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం అని వెల్లడించారు. భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తయింది. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం వైన్, విస్కీ ప్రియులు, లగ్జరీ కార్ల అభిమానులకు ఆనందాన్ని ఇస్తోంది. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారతీయ వస్తువులకు యూరోపియన్ మార్కెట్ల తలుపులు తెరుచుకుంటాయి. యూరప్ నుంచి దిగుమతి అయిన వస్తువులు భారతదేశంలో చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందాన్ని 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తల్లి' అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభివర్ణించారు. ప్రస్తుతం యూకే నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న స్కాచ్ విస్కీ, జిన్‌పై 150 శాతం సుంకాలను విధిస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఆ సుంకాలు 20 శాతానికి తగ్గుతాయి. అయితే దీనిని వెంటనే కాకుండా 5-10 సంవత్సరాల కాల వ్యవధిలో అమలు చేస్తారు. దీంతో యూరప్‌నకు చెందిన ప్రీమియం జిన్‌లు, వైన్, వోడ్కాలు చౌకగా లభిస్తాయి. అలాగే భారతీయ మద్యానికి కూడా ఈయూ సభ్య దేశాలలో పన్ను మినహాయింపులు లభిస్తాయి. మెర్సిడెస్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి వంటి యూరోపియన్ కార్లకు ప్రస్తుతం 100 శాతం పన్నులు విధిస్తున్నారు. ఒప్పందం తర్వాత ఆ పన్నులు నిర్ణయించిన కాల వ్యవధిలో పది శాతానికి తగ్గుతాయి. అయితే రూ. 25 లక్షల కంటే తక్కువ ధరకు అమ్ముడుపోయే అవకాశం ఉన్న కార్లను మాత్రం భారత్‌కు ఈయూ ఎగుమతి చేయదు. భారత ఆటోమొబైల్ పరిశ్రమను రక్షించడానికి ఈ నిబంధన పెట్టారు. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కేన్సర్, ఇతర తీవ్రమైన అనారోగ్యాల చికిత్సలో ఉపయోగించే మందుల ధరలు కూడా తగ్గుతాయి. అలాగే యూరప్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వైద్య పరికరాల ధరలు కూడా తగ్గుతాయి. యూరప్ నుంచి దిగుమతి చేసుకునే విమానాల విడి భాగాలు, మొబైల్ ఫోన్లు, హైటెక్ ఎలక్ట్రానిక్ వస్తువులపై సుంకాలు తగ్గుతాయి. ఇది భారతదేశంలో గా÷-జడెట్ల తయారీ ఖర్చులను తగ్గిస్తుంది. తుది వినియోగదారునికి ప్రయోజనం చేకూరుస్తుంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు చౌకగా లభించవచ్చు. ఇనుము, ఉక్కు, రసాయన ఉత్పత్తులపై సున్నా సుంకాల ప్రతిపాదన ఉంది. దీని వలన నిర్మాణ, పారిశ్రామిక రంగాలలో ముడి పదార్థాల ధరలు తగ్గుతాయి. అలాగే చాక్లెట్లు, సౌందర్య సాధనాలు, పలు గృహోపకరణాలు కూడా గతంలో కంటే చౌకగా లభిస్తాయి. ఇక, భారత్‌లో తయారయ్యే వస్త్రాలు, పాదరక్షలు, ఆటో భాగాలు, రత్నాలు, ఆభరణాలు, ఫర్నిచర్, క్రీడా వస్తువులు, రసాయనాలు, యంత్ర పరికరాలపై ఈయూ పన్నుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ మేరకు భారతీయ వస్త్ర, ఫుట్‌వేర్, ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థలు భారీగా లాభపడనున్నాయి.

# పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు అఖిలపక్షం నిర్వహించిన కేంద్రం

**వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**







**న్యూఢిల్లీ :** బడ్జెట్ సమావేశాల్లో అన్ని విషయాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అఖిలపక్ష భేటీలో కేంద్రం స్పష్టం చేసింది. అయితే చర్చకు అనుసరించాల్సిన తీరులో ముందుకు రావాలని కూడా సూచించింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం అఖజలపక్షభేటీ జరిగింది. సమావేశానంతనం వివరలాను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు వెల్లడించారు. అయితే 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై చర్చ జరగాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రివర్స్ గేర్ వేసి.. గతంలోకి వెళ్లలేమని, అది అసాధ్యమని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఏదైనా ఒక్కసారి చట్టరూపం దాల్చాక దానిని పాటించాల్సిందేనన్నారు. ఈ నెల 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేంద్రం మంగళవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ భేటీకి అధ్యక్షత వహించారు. ఆయా అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమావేశం అనంతరం కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. అయితే, బ్జడెట్ సమావేశాల నేపథ్యంలో.. సంబంధిత అంశాలపై చర్చలు జరపడమనేది నియమమని చెప్పారు. మోదీ ప్రభుత్వం ఎప్పుడూ నియమాలు, నిబంధనలను ఉల్లంఘించలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం నడచుకుంటామని చెప్పారు. ఎంపీలంతా ప్రజాసమస్యలను లేవనెత్తేందుకే ఎన్నికయ్యారని, వారికి భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, కానీ.. ఇతర సభ్యులు చెప్పేది వినడం కూడా బాధ్యతేనని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సమావేశాల అజెండా పంచుకుంటామని చెప్పారు. సమావేశంలో తెలుగు రాష్ట్రాల నుంచి కెఆర్ సురేశ్ రెడ్డి, లావు కృష్ణదేవరాయలు, పిల్లి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ పద్దులకు తుది మెరుగులు

**నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు**

**పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్**



**న్యూఢిల్లీ :** ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పాల్గొన్నారు. అలాగే ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బ్జడెట్ రూపకల్పనలో భాగమైన అధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం ఆమె బ్జడెట్ ప్రెస్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా తొమ్మిదోసారి. ఒక వైపు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మరోవైపు మన దేశం 7.4శాతం వృద్ధి సాధిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్ వెలువడనుంది. హల్వా వేడుకతో బ్జడెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే ఐదురోజులపాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.



## తిలక్ వర్మపై రోహిత్ శర్మ ప్రశంసలు

ఏ టీమ్ నుంచైనా ఎక్కువ మంది సీనియర్ ప్లేయర్స్ రిటైర్ అయిపోతే కొంత బ్యాలెన్స్ తప్పుతుంది. కానీ ఇండియా టీ20 టీమ్‌కి ఆ సమస్య రాలేదు. రోహిత్, కోహ్లి, జడేజా రిటైర్మెంట్ సమయానికి చాలా మంది యంగ్ ప్లేయర్స్ ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకున్నారు, స్టార్స్ ప్లేయర్స్‌గా ఎదిగారు. ఈ లిస్టులో యంగ్ సెన్సేషన్ తిలక్ వర్మ ఒకడు. ఈ తెలుగు కుర్రాడు చేజింగ్‌లో మాస్టర్ అనిపించుకున్నాడు. అతని మొత్తం యావరేజ్ 39.93, కానీ చేజింగ్‌లో 68.00గా ఉంది. 23 ఏళ్ల తిలక్.. ఛేజింగ్‌లో ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఇన్నింగ్స్‌ని ముందుకు తీసుకెళ్లి ఫినిష్ చేయడంలో టాప్ అని ప్రూవ్ చేశాడు. ఇండియా మాజీ కెప్టెన్, స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ కూడా ఇదే మాట అన్నాడు. ఇండియన్ క్రికెట్ చాలా మంది గ్రేట్ ఛేజర్స్‌ని చూసింది. విరాట్ కోహ్లి చాలా సంవత్సరాలు ఈ బాధ్యతను మోశాడు. తిలక్ ఇప్పటికీ తన కెరీర్ ప్రారంభంలోనే ఉన్నాడు, కానీ అతను చూపిన ప్రభావం గొప్పది. తిలక్ ఆడిన ఇంటర్నేషనల్ టీ20లలో, చేజింగ్‌లో ఎనిమిది సార్లు నాటౌట్‌గా ఉన్నాడు, వీటిలో ఇండియా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. మ్యాచ్ చేజారిపోతుందనుకున్న ప్రతిసారి తిలక్ ఇన్నింగ్స్ నిలబెట్టింది. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 166 పరుగులు చేయాలి, 116కే ఏకంగా 6 వికెట్లు కోల్పోయింది. తిలక్ 72 రన్స్ కొట్టి టీమ్‌ని గెలిపించాడు. 2025 ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌తో జరిగిన హై ప్రెజర్ మ్యాచ్‌లో భారత్ 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. మరోసారి తిలక్ కూల్‌గా ఆడుతూ ఛేజింగ్ ఫినిష్ చేశాడు. పరిస్థితి ఎంత కఠినంగా ఉంటే, తన ఆలోచన అంత క్లియర్‌గా ఉంటుందని తిలక్ నిరూపించాడు. తిలక్ మైండ్‌సెట్ గురించి టీమిండియా, ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఓపెన్‌గా మాట్లాడాడు. 2022లో తొలి ఐపీఎల్ సీజన్ నుంచి తిలక్ సెల్ఫ్ బిలీఫ్ చూపించాడని చెప్పాడు. తనను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు పంపమని అడిగాడని, గేమ్ ఫినిష్ చేస్తానని హామీ ఇచ్చాడని పేర్కొన్నాడు. అవకాశం ఇచ్చినప్పుడు చేసి చూపించాడని కూడా తెలిపాడు. తిలక్ ఆత్మవిశ్వాసంతో మాట్లాడాడని, అహంకారం కొంచెం కూడా లేదని రోహిత్ చెప్పాడు. తన గేమ్ గురించి అతడికి ఫుల్ క్లారిటీ ఉందని, బాధ్యత తీసుకోవడానికి ఆకలితో ఉన్నాడని చెప్పాడు. ఆ ఆట్టిట్యూడ్ తిలక్‌లో అలానే ఉందన్నాడు. 'తిలక్ ఒక బిగ్-మ్యాచ్ ప్లేయర్. ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు నిలబడగల వ్యక్తి. పాకిస్తాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్ ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. వికెట్లు పడిపోతున్నాయి, క్రౌడ్ చాలా లౌడ్‌గా ఉంది. తిలక్ తన వయస్సుకు మించిన మెచ్యూరిటీతో అన్నీ హ్యాండిల్ చేశాడు.' అని రోహిత్ తెలిపాడు. తిలక్ ప్రస్తుతం సర్జరీ నుంచి కోలుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియా - న్యూజిలాండ్ టీ20 సిరీస్‌కు దూరంగా ఉన్నాడు. కానీ 2026 టీ20 వరల్డ్ కప్ సమీపిస్తుండటంతో తిలక్ వర్మ రికవరీ అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. టీ20 టీమ్‌లో రెగ్యులర్ ప్లేయర్‌గా మారిన ఈ తెలుగబ్బాయి వరల్డ్ కప్ స్క్వాడ్‌లో కచ్చితంగా ఉండాలని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

# ఐదుగురు యంగ్ గన్స్‌పైనే అందరి ఫోకస్

ప్రపంచ క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ అంటేనే ఒక హైవోల్టేజ్ ఎమోషన్. ముఖ్యంగా డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో టీమ్‌ఇండియా బరిలోకి దిగుతుంటే ఆ క్రేజ్ వేరే లెవల్‌లో ఉంటుంది. రోహిత్, విరాట్, జడేజా వంటి దిగ్గజాలు తప్పుకున్నాక టీమ్‌ఇండియా ఒక కొత్త రూపాన్ని సంతరించుకుంది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో, గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో కుర్రాళ్లు దుమ్మురేపుతున్నారు. అయితే ఈసారి జరగబోయే 2026 మెగా టోర్నీలో కొందరు ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. ఇప్పటివరకు వరల్డ్ కప్ ఆడని ఆ ఐదుగురు యంగ్ గన్స్?పైనే అందరి ఫోకస్ పడింది. వీరంతా ఐపీఎల్, అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటికే తమ మార్కును చాటారు. ఇప్పుడు అతిపెద్ద వేదికపై తమ సత్తా నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. పంజాబ్ నుంచి వచ్చిన లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ ప్రస్తుతం టీమ్‌ఇండియాలో ఒక సెన్సేషన్. ఐసీసీ టీ20లో అతడిదే మొదటి ర్యాంక్. జింబాబ్వేపై సెంచరీ కొట్టినప్పటి నుంచి అభిషేక్ శర్మ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఇప్పటివరకు ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1115 పరుగులు చేసి తన సత్తా చాటాడు. ముఖ్యంగా 188పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం అంటే మామూలు విషయం కాదు. పవర్‌ప్లేలో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించడం ఇతనికి వెన్నతో పెట్టిన విద్య. డిఫెండింగ్ ఛాంపియన్ ఇండియాకు మెరుపు ఆరంభాలు ఇవ్వడంలో అభిషేక్ కీలక పాత్ర పోషించనున్నాడు. అమృత్‌సర్ నుంచి వచ్చిన ఈ కుర్రాడు ఓపెనర్‌గా బరిలోకి దిగి భారీ స్కోర్లు సాధిస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. వరల్డ్ కప్ వేదికపై ఈ యువ కెరటం ఎలాంటి విధ్వంసం సృష్టిస్తాడో చూడాలని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చాలా కాలంగా జట్టులో ఉన్నా వాషింగ్టన్ సుందర్‌కు ఇది మొదటి టీ20 వరల్డ్ కప్ కావడం విశేషం. బ్యాటింగ్‌లోనూ బౌలింగ్‌లోనూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. కేవలం పవర్‌ప్లేలో బౌలింగ్ చేయడమే కాదు, అవసరమైనప్పుడు మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడంలోనూ దిట్ట. 58 మ్యాచ్‌ల్లో 51 వికెట్లు తీసి ఎకానమీని కంట్రోల్ చేయడంలో సక్సెస్ అయ్యాడు. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టులో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లు ఎక్కువగా ఉన్నప్పుడు సుందర్ తో వారిని కట్టడి చేస్తున్నారు. బ్యాటింగ్‌లో కూడా మునుపటి కంటే చాలా మెరుగయ్యాడు. లోయర్ ఆర్డర్‌లో వచ్చి వేగంగా పరుగులు రాబట్టడంలో సుందర్ కీలకం కానున్నాడు. ఈ 26 ఏళ్ల ఆల్‌రౌండర్ తన అనుభవంతో ఇండియాకు రెండోసారి కప్పు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాడని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో కీలక



మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఇతనికి ఈ మెగా టోర్నీలో కలిసి వస్తుంది. రింకూ సింగ్ పేరు వింటేనే స్టేడియంలో అరుపులు వినిపిస్తాయి. గత వరల్డ్ కప్‌లో స్టాండ్‌బై ప్లేయర్‌గా వెళ్లిన రింకూ ఈసారి ఏకంగా మెయిన్ స్క్వాడ్‌లో చోటు సంపాదించాడు. 35 టీ20ల్లో 42 సగటుతో 550 పరుగులు చేయడం అంటే అది రింకూకే సాధ్యం. దాదాపు 162 స్ట్రైక్ రేట్‌తో చివర్లో వచ్చి మ్యాచ్‌లను ఫినిష్ చేయడంలో ఇతను మొనగాడు. అయితే జట్టులో ఆల్‌రౌండర్లకే ప్రాధాన్యత ఇస్తుండటంతో తుది జట్టులో అవకాశం రావడం కొంచెం కష్టమే అనిపిస్తోంది. కానీ గంభీర్, సూర్యకుమార్ ఈ 'లిటిల్ మాస్టర్' పై నమ్మకం ఉంచారు. ఒత్తిడిలో కూడా కూల్‌గా బ్యాటింగ్ చేసి సిక్సర్ల వర్షం కురిపించే రింకూ, ఇండియాకు మరో వరల్డ్ కప్ తెస్తాడనే నమ్మకం అందరిలో ఉంది. ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన ఈ కుర్రాడు తన హార్డ్ వర్క్‌తో ఈ స్థాయికి చేరుకున్నాడు. టీమ్ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు రింకూ ఇచ్చే ఫినిషింగ్ టచ్ టీమ్‌ఇండియాకు వెన్నెముకగా మారుతుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన హర్షిత్ రాణా ఇప్పుడు వరల్డ్ కప్ స్టేజీపై మెరవబోతున్నాడు. గంభీర్ కోచింగ్‌లో రాటుదేలిన ఈ 24 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ 145 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరగలడు. ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌ల్లో ఏడు వికెట్లు తీసినా, ఎకానమీ విషయంలో కొంచెం మెరుగుపడాల్సి ఉంది. కానీ డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడం, అవసరమైతే బ్యాటింగ్‌లో కూడా మెరుపులు మెరిపించడం ఇతని ప్రత్యేకత. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ వంటి సీనియర్ల నీడలో హర్షిత్ మరిన్ని మెలకువలు నేర్చుకుంటున్నాడు. ఆరంభంలో కొంచెం వివాదాలు ఎదుర్కొన్నా, తన బౌలింగ్‌తోనే అందరి నోళ్లు మూయించాలని చూస్తున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ ఈ లిస్టులో ఉండడం మరో హైలెట్. ఇటీవల వృషణాల సమస్య వల్ల సర్జరీ చేయించుకున్నా, వరల్డ్ కప్ నాటికి కోలుకుంటాడని అందరూ నమ్ముతున్నారు. సౌత్ ఆఫ్రికా గడ్డపై బ్యాక్ టు బ్యాక్ సెంచరీలు కొట్టి తనలో ఎంత టాలెంట్ ఉందో ప్రపంచానికి చాటిచెప్పాడు. గతేడాది పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టీమ్‌ఇండియా మిడిల్ ఆర్డర్‌లో తిలక్ ఒక నమ్మదగ్గ బ్యాటర్‌గా ఎదిగాడు. టెక్నిక్ పరంగానూ, మానసికంగానూ చాలా బలంగా ఉండే తిలక్, ఒత్తిడిలో కూడా పరుగులు రాబట్టగలడు. 20 జట్ల టోర్నమెంట్‌లో ఇండియాను గెలిపించడానికి తిలక్ వర్మ బ్యాట్ ఝులిపించడం చాలా అవసరం.

# దుమ్మురేపిన ముంబై ఇండియన్స్

వుమెన్స్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో జోరు కనబర్చిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఒక్కసారిగా ఢీలా పడింది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కొట్టిన దెబ్బకు విలవిలలాడుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడి డేంజర్ జోన్‌లో నిలిచింది. మరోవైపు ప్లే ఆఫ్స్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ దుమ్మురేపింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ నాట్ సీవర్ బ్రంట్(57 మ్యాచ్‌ల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 100) విధ్వంసకర శతకంతో 15 పరుగుల తేడాతో ఆర్‌సీబీని ముంబై ఓడించింది. ఈ గెలుపుతో లీగ్ ప్రారంభ మ్యాచ్‌లో ఎదురైన మ్యాచ్‌కు ముంబై ప్రతీకారం తీర్చుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై నాట్ సీవర్ నాటు కొట్టుడుకు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. హీలీ మాథ్యూస్(39 బంతుల్లో 9 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(12 బంతుల్లో 20) దూకుడుగా ఆడింది. ఆర్‌సీబీ బౌలర్లలో లారెన్ బెల్ రెండు వికెట్లు తీయగా.. నదినే డీక్లెర్క్, శ్రేయాంక పాటిల్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 184 పరుగులు చేసింది. రిచా ఘోష్(50 బంతుల్లో 10 ఫోర్లు, 6



సిక్స్‌లతో 90) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. గ్రేస్ హ్యారీస్(15), స్మృతి మంధాన(6), జార్జియో వోల్(9), గౌతమి నాయక్(1) తీవ్రంగా నిరాశపర్చారు. రిచా ఘోష్‌కు అండగా ఒక్క బ్యాటర్ రాణించినా ఫలితం మరోలా ఉండేది. ముంబై బౌలర్లలో హీలీ మాథ్యూస్(3/10) ఆర్‌సీబీ పతనాన్ని శాసించింది. షబ్నీమ్ ఇస్మాయిల్, అమెలియా కేర్ రెండేసి వికెట్లు తీయగా.. అమన్‌జోత్ కౌర్ ఒక వికెట్ తీసింది. వరుసగా 5 విజయాలతో ఇప్పటికే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకున్న ఆర్‌సీబీ.. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి నేరుగా ఫైనల్ చేరే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇప్పటికిప్పుడు ఆర్‌సీబీకి వచ్చిన ప్రమాదం ఏం లేదు. యూపీ వారియర్స్‌తో గురువారం జరిగే తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తే ఏ జట్టుతో సంబంధం లేకుండా ఆర్‌సీబీ ఫైనల్ చేరుతుంది. కానీ ఆ జట్టులో కూడా ఓడితే మాత్రం.. గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఈ రెండు జట్లు తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే 10 పాయింట్స్‌తో నిలుస్తాయి. ఇప్పటికే ఆర్‌సీబీ 10 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. అప్పుడు మెరుగైన రన్ రేట్ ఉన్న జట్టు ఫైనల్ చేరుతుంది. ఈ రెండు జట్లతో పోలిస్తే ఆర్‌సీబీ రన్‌రేట్ మెరుగ్గా ఉంది. ఆఖరి మ్యాచలో ఓడినా రన్‌రేట్ కాపాడుకుంటే ఆర్‌సీబీకి ఫైనల్ బెర్త్ దక్కుతుంది. కానీ ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఓడితే ఆర్‌సీబీ ఆత్మ విశ్వాసం దెబ్బతిననుంది. ఆర్‌సీబీ తమకు అలవాటైన రీతిలోనే ఒక్క మ్యాచ్ ఓడితే వరుసగా చేతులెత్తేస్తోంది. ఫైనల్‌కు ముందు ఆత్మవిశ్వాసం పెరగాలంటే ఆఖరి మ్యాచ్‌లో ఆర్‌సీబీ గెలవాలి.

# న్యూజిలాండ్ జట్టులో ప్రక్షాళన

ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు గడ్డు కాలం నడుస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఇప్పటికే జరిగిన మొదటి మూడు మ్యాచుల్లోనూ చిత్తుగా ఓడిపోయిన కివీస్, సిరీస్‌ను 0-3తో భారత్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో తమ జట్టును ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్న న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు, ఇద్దరు ఆటగాళ్లను జట్టు నుండి విడుదల చేసి, వారి స్థానంలో సీనియర్ ఆటగాళ్లను ఆహ్వానించింది. వచ్చే నెలలో జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా ఈ మార్పులు అత్యంత ప్రాధాన్యతను సంతంతరించుకున్నాయి. భారత్‌తో జరిగిన మొదటి మూడు మ్యాచుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన వేగవంతమైన బౌలర్ క్రిస్టియన్ క్లార్క్ మరియు ఓపెనింగ్ బ్యాటర్ టిమ్ రాబిన్సన్లను న్యూజిలాండ్ మేనేజ్‌మెంట్ జట్టు నుండి తప్పించింది. వీరిద్దరూ స్వదేశానికి తిరిగి వెళ్లనున్నారు. టీ20 ప్రపంచకప్‌కు ముందు జట్టు కలయికను సరిచూసుకోవడంలో భాగంగా యువ ఆటగాళ్లకు బదులు అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ భావిస్తున్నారు. సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచుల కోసం న్యూజిలాండ్ జట్టులోకి ముగ్గురు కీలక ఆటగాళ్లు వచ్చి చేరారు. జిమ్మీ నీషమ్: ఐపీఎల్, వివిధ దేశాల లీగ్ మ్యాచుల్లో ఆడిన అనుభవం ఉన్న నీషమ్, ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతుల్యతను తీసుకురానున్నాడు. లూకీ ఫెర్గూసన్: తన వేగంతో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల సామర్థ్యం ఫెర్గూసన్‌కు ఉంది. భారత పిచ్‌లపై అతనికి ఉన్న అవగాహన జట్టుకు కీలకం కానుంది. ఫిన్ అలెన్: దూకుడుకు మారుపేరు ఫిన్ అలెన్. అతడిని కివీస్ అభిషేక్ శర్మగా పేరు ఉంది. తిరువనంతపురంలో జరిగే ఐదో టీ20 నాటికి అతను అందుబాటులోకి వస్తాడని సమాచారం. అతడు తుది జట్టులోకి వస్తే కాన్వే బెంచ్ మీదకు వెళ్తాడు. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు.

ముఖ్యంగా గౌహతిలో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లోనే 68 పరుగులు చేసి కివీస్ బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా వరుసగా రెండు అర్ధ సెంచరీలు సాధించి ఫామ్‌లోకి రావడం భారత్‌కు పెద్ద సానుకూలాంశం. కేవలం 10 ఓవర్లలోనే 154 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ తన అధికారాన్ని చాటుకుంది. వచ్చే ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికలుగా జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026కు ముందు ఈ సిరీస్ రెండు జట్లకు చాలా ముఖ్యం. భారత్ అజేయంగా దూసుకుపోతుండగా, న్యూజిలాండ్ మాత్రం తన బలహీనతలను అధిగమించే ప్రయత్నంలో ఉంది. డెత్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయలేకపోవడం కివీస్‌కు ప్రధాన సమస్యగా మారింది. ఇప్పుడు వచ్చిన సీనియర్ బౌలర్లు ఆ లోటును భర్తీ చేస్తారని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది.

# టీ20 వరల్డ్‌కప్‌లో పాక్ భారీ ప్లాన్

టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ పాల్గొనడంపై సందిగ్ధం వీడడం లేదు. ప్రపంచకప్‌లో పాల్గొనడంపై శుక్రవారం లేదా వచ్చే సోమవారం నాటికి తమ తుది నిర్ణయం ప్రకటిస్తామని పీసీబీ చీఫ్ మొహ్సిన్ నక్వీ చెప్పినప్పటికీ, టీ20 వరల్డ్‌కప్‌ను లేదా భారత్‌తో జరిగే కీలక మ్యాచ్‌ను బహిష్కరించే అవకాశం దాయాది దేశానికి లేదని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవలే బంగ్లాదేశ్‌కు మద్దతుగా టీ20 ప్రపంచకప్‌ను బహిష్కరిస్తామంటూ పాక్ బెదిరింపులకు దిగింది. అయితే ఈ దేశానికి ఆ ఛాన్స్ లేనట్లు తెలుస్తోంది. కాగా, టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే విషయమై పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నక్వీ సోమవారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. ఈ క్రమంలో అన్ని ఆప్షన్లను పాక్ ప్రధాని ముందుంచారు. "పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫలప్రదమైన సమావేశం జరిగింది. బంగ్లాదేశ్ విషయంలో ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని ఆయనకు వివరించాను. అన్ని అవకాశాలనూ ఉపయోగించుకుని, సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. తుది నిర్ణయం శుక్రవారం లేదా వచ్చే సోమవారం తీసుకుంటాం" అని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నక్వీ సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆ పోస్ట్‌కు కొన్ని గంటల ముందు, బంగ్లాదేశ్ విషయంలో ఐసీసీ వ్యవహరించిన తీరుకు ప్రతీకారంగా టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్థాన్ జట్టు పాల్గొనడానికి ప్రభుత్వం అనుమతించే అవకాశం లేదని పాకిస్థాన్ మీడియాలో ప్రచారం జరిగింది. ఒకవేళ టోర్నీలో పాల్గొన్నా ఫిబ్రవరి 15న భారత్‌తో జరిగే గ్రూప్ ఏ మ్యాచ్‌ను పాక్ బహిష్కరించే అవకాశం ఉందని కథనాలు వచ్చాయి. అయితే తాజాగా వెలువడిన నివేదికల ప్రకారం, ఇలాంటి నిర్ణయాలు పీసీబీకి తీవ్ర నష్టాన్ని మిగిల్చే అవకాశం ఉంది. ఇప్పటికే కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, పాకిస్థాన్‌పై కఠిన ఆంక్షలు విధించే అవకాశం ఉందని పీసీబీ వర్గాలకు ఐసీసీ స్పష్టమైన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ టోర్నీల నుంచి సస్పెన్షన్, ఆసియా కప్‌లో పాల్గొనే హక్కు కోల్పోవడం, పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆడే ఆటగాళ్లకు విదేశీ లీగ్‌ల కోసం ఇచ్చే ఎన్‌ఓసీలను నిలిపివేయడం వంటి చర్యలు ఎదుర య్యే ప్రమాదం ఉందని తెలుస్తోంది. మరో వైపు, పాకిస్థాన్ మ్యాచ్‌లు తమకు అనుకూలంగా ఎంపిక చేసిన వేదికలోనే జరగనున్న నేపథ్యంలో, భారత్‌తో మ్యాచ్‌ను లేదా మొత్తం వరల్డ్ కప్‌ను బహిష్కరిం చడానికి సరైన కారణాలు లేవన్న అభిప్రా యం కూడా వ్యక్తం అవుతోంది. ఇక మరో కీలక అంశం ఏంటంటే ఒకవేళ పాకిస్థాన్ టోర్నీ నుంచి తప్పు కుంటే, బంగ్లాదేశ్‌ను మళ్లీ వరల్డ్ కప్‌కు పిలిచే అంశా న్ని ఐసీసీ



పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలా జరిగితే, బంగ్లాదేశ్ తమ మొదటి డిమాండ్ ప్రకారం శ్రీలం కలోనే అన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కుతుందని, ఇది లాజిస్టిక్‌గా కూడా పెద్ద సమస్య కాదని సంబం ధిత వర్గాలు తెలిపాయి. భారత్, శ్రీలం క వేదికగా టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7- మార్చి 8 వరకు జరగనుంది. అయితే ఈ టోర్నీ నుంచి బంగ్లాదేశ్ వైదొలిగింది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్ ఆడనుంది.



# ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి క్రేజీ అప్‌డేట్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మాస్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా డబ్బింగ్ పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత పవన్ కళ్యాణ్ , హరీష్ శంకర్ దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా హరీష్ శంకర్ రాసిన పవర్‌ఫుల్ డైలాగులకు పవన్ తనదైన శైలిలో గొంతును అందించబోతుండటం హైలైట్‌గా మారనుంది. ఇక తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు టాక్ నడుస్తుంది. వాస్తవానికి ఆ తేదీన విడుదల కావాల్సిన రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం వాయిదా పడటంతో, ఆ స్థానాన్ని 'ఉస్తాద్ భగత్ సింగ్' భర్తీ చేయనున్నట్లు సమాచారం. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'ఈసారి పర్ఫార్మెన్స్ బద్ధలైపోద్ది' అంటూ ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమా రేంజ్‌ను చెప్పకనే చెప్పగా, ఇప్పుడు డబ్బింగ్ పనులు మొదలవ్వడం సినిమా విడుదలకు అడుగులు వేగంగా పడుతున్నాయనే సంకేతాలను ఇస్తోంది.

# పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ముమ్మాటికీ నిజం

## మెగాస్టార్ వ్యాఖ్యలతో విభేదించిన గాయని చన్మయి శ్రీపాద



చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవని చిరంజీవి చేసిన కామెంట్స్‌తో గాయని చన్మయి శ్రీపాద విభేదించారు. ఇవి లేకుండా సినీ పరిశ్రమ లేదని ఖరాఖండిగా చెప్పారు. సినిమాలో అవకాశం కావాటంలే.. లొంగిపోవాలన్నది నిజమని చెప్పారు. పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని ఆమె అన్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఎక్స్ వేదికగా ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇండస్ట్రీలో నిబద్ధత అనే పదానికి పూర్తి భిన్నమైన అర్థం ఉందని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ సమస్య ఎక్కువగా ఉంది. కమిట్‌మెంట్ ఇవ్వకపోతే కొత్త వారికి అవకాశాలు రావు. సాధారణంగా కమిట్‌మెంట్ అంటే వృత్తిపరమైన నిబద్ధత అనే అర్థం. కానీ, ఇండస్ట్రీలో మాత్రం దాని అర్థం వేరు. కొందరు పురుషులు ఈ పదాన్ని ఉపయోగించి మహిళల నుంచి ఏవేవో ఆశిస్తారు. గతంలో ఓ ప్రముఖ సింగర్ ఇండస్ట్రీలో ఎదురైన చేదు అనుభవాలకు భయపడి ఈ రంగాన్నే వదిలివెళ్లిపోయింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంతోమంది ఇక్కడ వేదికలపై స్పీచ్‌లు ఇస్తూనే ఉన్నారని చిన్మయి తెలిపారు. తాను కూడా గతంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. తన తల్లి సమక్షంలోనే ఎంతో నమ్మిన ఒక పెద్దాయన తనతో తప్పుగా ప్రవర్తించాడని అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి ఓ లెజెండ్ అని ఆమె అన్నారు. ఆయన తరంలో నటీనటులలంతా ఒకరితో ఒకరు స్నేహభావంతో ఉండేవారని.. పరస్పరం గౌరవించుకునే వారని చెప్పారు. లెజెండ్‌లతో కలిసి వర్క్ చేసిన వారు కూడా తన దృష్టిలో గొప్పవారేనని చిన్మయి తెలిపారు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' సక్సెస్ మీట్‌లో చిరంజీవి ఇండస్టీ గురించి మాట్లాడారు. 'సినీ ఇండస్టీ అద్దం లాంటిది. మనం ఎలా ఉంటామో అలాంటి ఫలితమే వస్తుంది. ఎవరైనా సరే సినీ ఇండస్ట్రీలోకి వస్తానంటే వారిని ప్రోత్సహించాలి. ఇది గొప్ప ఇండస్టీ. 'ఇక్కడ నెగెటివ్ పీపుల్ ఉంటారు. చేదు అనుభవాలు ఎదురవుతాయి' అనుకుంటే అది నీ తప్పిదం. నువ్వు నిక్కచ్చిగా ఉంటే ఎవరూ అవకాశం తీసుకోరు. క్యాస్టింగ్ కౌచ్‌లాంటివి ఉండవు . నువ్వు ప్రొఫెషనల్‌గా ఉండాలి. కొత్త టాలెంట్‌కు ఎప్పుడూ ప్రోత్సాహం లభిస్తూనే ఉంటుంది' అని ఆయన అన్నారు. అయితే చిరంజీవి వ్యాఖ్యలతో చిన్మయి విభేదించారు.

# విలనిజం పండించాలనుందన్న తరుణ్ భాస్కర్

## ఓంశాంతితో కల నెరవేరిందన్న ఈశా రెబ్బా



ప్రతినాయకుడిగా నా సత్తాచాటాలని ఉందని నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ అన్నారు. నటుడిగా కంటే డైరెక్టర్‌గా ఉండడమే తనకు ఇష్టమన్నారు తరుణ్ భాస్కర్. కానీ, జీవితంలో ఒక్కసారైనా పూర్తి నెగెటివ్ రోల్‌లో నటించాలనే కోరిక ఉందన్నారు. ఆయన, ఈషారెబ్బా జంటగా నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఎ.ఆర్. సజీవ్ దర్శకుడు. మళయాల మూవీ 'జయ జయ జయ జయహే' కి రీమేక్‌గా రూపొందిన ఈ సినిమా జనవరి 30న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తరుణ్ ఆసక్తికర సమాధానాలు చెప్పారు. ఇకపోతే ఎప్పట్నుంచో తాను ఎదురు చూస్తున్న పాత్ర ఈ సినిమాతో దొరికిందని, దాంతో ఇందులోని శాంతి పాత్రని వందశాతం మనసుపెట్టి చేశానన్నారు ఈషారెబ్బా. స్వతహాగా తనకు యాక్షన్ ప్రధానమైన సినిమాలంటే ఇష్టమనీ, ఈ సినిమాలోని యాక్షన్ కోణం కూడా తనకు ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అచ్చ తెలుగు కథానాయికైన ఈషారెబ్బా 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంలో నటించారు. ఇందులో తరుణ్‌భాస్కర్ కథానాయకుడు. మంచి కథతో రూపొందిన సినిమా ఇది. అబ్బాయిలు, అమ్మాయిలు... అందరూ కనెక్ట్ అయ్యే బలమైన కథ. ఆలోచన రేకెత్తించే సందేశం ఉన్నా, అది కూడా హాస్యకోణంలోనే ఉండటం ఈ సినిమా ప్రత్యేకత. నేను శాంతి అనే యువతిగా కనిపిస్తా. కరోనా సమయంలో నేను నేర్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈ పాత్రకి బాగా పనికొచ్చిందన్నారు. గోదావరి నేపథ్యంలో సాగే ఈ కథలో పాత్రలన్నీ ఆ యాసలో మాట్లాడుతుంటాయి. నేను పుట్టి పెరిగింది తెలంగాణలో అయినా, మా అమ్మ తరపు బంధువులంతా రాజమండ్రికి చెందినవారే. అక్కడికి పండగలప్పుడు వెళ్లి వచ్చేదాన్ని. దాంతో నాకు ఆ యాస మాట్లాడటం పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. తరుణ్‌భాస్కర్ మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుని డబ్బింగ్ చెప్పారు. సినిమాలో చెంపదెబ్బకు సంబంధించిన సన్నివేశాలు చాలానే ఉంటాయని ముందే తెలుసు. అయితే చట్నీ అంటిన చేత్తో కొట్టే సన్నివేశంలో నిజంగానే గట్టిగా కొట్టారు తరుణ్ భాస్కర్. సన్నివేశం పండాలని, చట్నీ ముఖానికి అంటుకోవాలని దర్శకుడు నిజంగానే కొట్టమన్నారట. ఆ సన్నివేశంలో కనిపించే నా కన్నీళ్లు నిజమైనవే. సన్నివేశం పూర్తయ్యాక నిజంగానే ఏడ్చేశానన్నారు.



# మేలో దేవర-2 షూటింగ్ మొదలు

# ఎన్టీఆర్ అభిమానులకు పండగవార్త

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'కు సీక్వెల్‌పై అప్డేట్ వచ్చింది. 2024లో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా మంచి ఆదరణను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత దీనిపై పెద్దగా అప్‌డేట్స్ రాకపోవడంతో నెట్టింట రకరకాల వార్తలు ప్రచారమయ్యాయి. తాజాగా ఈ సినిమా నిర్మాత సుధాకర్ ఓ కార్యక్రమంలో 'దేవర 2'అప్‌డేట్ పంచుకున్నారు. ఈ ఏడాది మేలో దీని సీక్వెల్ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదిలో సినిమాను విడుదల చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. దీంతో అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. 'దేవర' విడుదలై ఏడాదైన సందర్భంగా గతేడాది సెప్టెంబర్‌లో నిర్మాణసంస్థ ఈ సీక్వెల్‌పై ఓ పోస్ట్ పెట్టింది. 'ప్రపంచం ఎప్పటికీ గుర్తుపెట్టుకునే పేరు ఇది. తాను పంచిన ప్రేమ, తాను చూపిన భయం.. ఎప్పటికీ మర్చిపోలేరు. 'దేవర 2' కోసం అందరూ సిద్ధంగా ఉండండి' అని పేర్కొంది. 'దేవర 2'పై కొరటాల గతంలో కొన్ని ఇంటర్వ్యూల్లో మాట్లాడి అంచనాలు పెంచేశారు. మొదటిభాగం కంటే రెండో భాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఆయన వెల్లడించారు. పార్ట్-1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు



# కొంటెగా కవ్విస్తున్న మీనాక్షి..

కాస్త గ్యాప్ దొరికితే చాలు సోషల్ మీడియాలో దూరిపోయే సెలబ్రిటీలు ఈమధ్య మరింత ఎక్కువైపోయారు. అందులో భాగంగానే సినిమాలకు సంబంధించిన ప్రమోషన్స్ తో పాటు తమ ఉనికిని చాటుకోవడానికి ఇలా అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరికొంతమంది లంగా ఓణీలలో.. చీరకట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూ అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా సంక్రాంతి హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి కొంటెగా కవ్విస్తూ కొన్ని ఫోటోలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంది. ఎల్లో, మెరూన్ రెడ్ కాంబినేషన్లో ఉన్న లంగావోణీ ధరించిన ఈమె.. తన అందాలతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. కొంటెగా ఫోటోలకు ఫోజులు ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.." కొంచెం నాటీ..కొంచెం స్వీట్" అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం మీనాక్షి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈమె అందాన్ని చూసి అభిమానులు ముగ్ధులు అవుతున్నారు. అంతేకాదు ఫేస్ ఎక్స్ప్రెషన్స్ అద్భుతం అంటూ కొంతమంది కామెంట్లు చేస్తుండగా.. మరికొంతమంది నెటిజన్స్ మీనాక్షి అందానికి ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే అంటూ కామెంట్ పెడుతున్నారు. ఇంకొంతమంది మీనాక్షి మన ఇంటి అమ్మాయి అంటూ ఎవరికి వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉండడం గమనార్హం. మీనాక్షి మోడల్ గా తన కెరీర్ను ఆరంభించింది. 2018 లో మిస్ ఇండియాగా, మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ ఫస్ట్ రన్నరప్ నిలిచి అందరిని ఆశ్చర్యపరిచింది. 2021లో సుశాంత్ హీరోగా వచ్చిన ఇచ్చట వాహనములు నిలపరాదు అనే సినిమాలో హీరోయిన్గా నటించి తెలుగు తెరకు పరిచయమైంది . ఇకపోతే ఈ సినిమా సమయంలోనే సుశాంత్ తో మంచి స్నేహం ఏర్పడింది. ఆ స్నేహం కాస్త అప్పుడప్పుడు కలిసి కనిపించే రేంజ్ కి వెళ్ళింది. అయితే ఇది చూసిన చాలామంది వీరిద్దరూ డేటింగ్ లో ఉన్నారని పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అంటూ వార్తలు రాగా.. ఇటీవల ఒక సినిమా ప్రమోషన్స్ లో భాగంగా స్పందించి రూమర్స్ కి చెక్ పెట్టింది మీనాక్షి. ఇకపోతే మీనాక్షి సంక్రాంతి హీరోయిన్ గా హ్యాట్రిక్ అందుకుంది. 2024 లో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేష్ బాబు నటించిన గుంటూరు కారం సినిమాలో హీరోయిన్గా నటించి మంచి విజయం అందుకుంది. ఇక 2025న మళ్లీ సంక్రాంతికి వెంకటేష్ తో అనిల్ రావిపూడి తెరకెక్కించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా చేసి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇక ఈ ఏడాది సంక్రాంతికి కూడా సందడి చేసింది ఈ ముద్దుగుమ్మ. నవీన్ పోలిశెట్టి హీరోగా వచ్చిన అనగనగా ఒక రాజు సినిమాలో హీరోయిన్గా నటించి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అలా వరుసగా మూడు సంవత్సరాల పాటు సంక్రాంతికి వస్తూ మంచి విజయాలను అందుకొని.. సంక్రాంతికి హ్యాట్రిక్ కొట్టిన హీరోయిన్గా రికార్డు సృష్టించింది మీనాక్షి చౌదరి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463